# సాక్షి ప్రకాశం

బుధవారం । 5 । ఏప్రిల్ । 2023




**రంగనాయకా.. పాహిమాం**

నెమలిగుండ్ల రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. - 8లో..



**అంబరాన్నంటిన ఆసరా సంబరాలు**

వైఎస్సార్ ఆసరా మూడో విడత నగదు జమ చేసిన సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
34 /27

**వాతావరణం**

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వాతావరణంలో తేమ శాతం అధికం. ఉక్కపోతగా ఉంటుంది.




# కార్చిచ్చుకు కళ్లెం

ఎండా కాలం నల్లమలను కార్చిచ్చు వెంటాడుతోంది. విలువైన అటవీ సంపద బుగ్గిపాలవుతుండగా వేలాది వన్యప్రాణులకు ముప్పు వాటిల్లుతోంది. అటవీశాఖ అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నా తరుచూ ప్రమాదాలు సంభవించడం ఆందోళన కలిగిస్తోంది. వీటిని అదుపు చేసేందుకు అధికారులు ఒక వైపు గిరిజనులు, పర్యాటకులు, ప్రయాణికులకు అవగాహన కల్పిస్తూనే పలు కఠిన నిబంధనలు అమలు చేస్తున్నారు. అలాగే శాటిలైట్ ద్వారా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తిస్తున్నారు.

- నల్లమలలో అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు
- 114 మంది ఫైర్‌వాచర్స్ నియామకం
- శాటిలైట్ ద్వారా సమాచారం
- చెంచులు, ప్రయాణికులు, పర్యాటకులకు అవగాహన
- కఠిన నిబంధనలు అమలు

**అగ్ని ప్రమాదాలు..**

గడిచిన ఐదేళ్లలో: 5,063

ఈ ఏడాది 3 నెలల్లో: 937



నల్లమలలో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది (ఫైల్)

మార్కాపురం: వేసవి వచ్చిందంటే అగ్ని ప్రమాదాల భయం నల్లమలను వెంటాడుతోంది. తెలిసో తెలియకో చేస్తున్న మానవ తప్పిదాలు అడవులను కాల్చి వేస్తున్నాయి. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. దీని వలన పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోంది. దోర్నాల నుంచి శ్రీశైలం, దోర్నాల, ఆత్మకూరు, గిద్దలూరు నంద్యాల మధ్య ఘాట్‌రోడ్డులో ప్రతిరోజు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వేలాది మంది ప్రయాణికులు ప్రయాణిస్తుంటారు. కొంత మంది బీడీ, సిగరెట్ తాగి ఆర్పకుండా నిర్లక్ష్యంగా రోడ్డుపై వేస్తున్నారు. ఇది పెనుముప్పుగా పరిణమించింది. అసలే వేసవి తీవ్రత ఆపై కిందపడిన నిప్పు కారణంగా పక్కనే ఉన్న ఆకులు, గడ్డి అంటుకుని వేగంగా వ్యాపించి అడవులను దహించి వేస్తున్నాయి. ఫలితంగా పర్యావరణం దెబ్బతింటోంది. వేలాది వన్యప్రాణులు ప్రాణాలు కోల్పోతున్నాయి. మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది. దీనిపై అటవీశాఖ అధికారులు ప్రయాణికులకు, గిరిజన గూడేల్లో చెంచులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నారు.

**నివారణకు ప్రత్యేక దృష్టి:**

పర్యావరణాన్ని కాపాడుతున్న వాటిల్లో అడవులు కీలకమైనవి. నల్లమల అటవీ ప్రాంతంలో పర్యావరణాన్ని కాపాడేందుకు అటవీశాఖాధికారులు నడుంబిగించారు. దోర్నాల నుంచి శ్రీశైలం, కర్నూలు జిల్లా ఆత్మకూరు నుంచి దోర్నాల వరకు, మహబూబ్ నగర్ జిల్లా అచ్చంపేట నుంచి శ్రీశైలం ప్రాజెక్టు వరకు ప్రత్యేక దృష్టి సారించారు. మార్కాపురం అటవీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పరిధిలో మార్కాపురం, దోర్నాల, వైపాలెం, గంజివారిపల్లి, నెక్కంటి, కొర్రపోలు, గుంటూరు జిల్లా విజయపురి సౌత్ రేంజ్ ఉన్నాయి. అటవీ ప్రాంతంలో ఉన్న విలువైన వృక్షసంపద, రకరకాల పక్షులు, జంతువులను కాపాడేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అగ్నిప్రమాదాలు జరిగితే తక్షణం అక్కడికి వెళ్లి మంటలను ఆర్పేందుకు 114 మంది ఫైర్‌వాచర్స్‌ను అందుబాటులోకి తెచ్చారు. వీరికి ఫైర్ ఫైటింగ్ ఎక్విప్‌మెంట్లను అందజేశారు. వాకీటాకీల ద్వారా అధికారులకు సమాచారం అందిస్తే వెంటనే అక్కడకు చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు వీలవుతోంది. దీనితో పాటు అటవీ ప్రాంతంలో నీటికుంటలను ఏర్పాటు చేసి అప్పటికప్పుడు నీటిని తీసుకుని వెళ్లేందుకు వాహనాలను సమకూర్చారు. ఈ సిబ్బంది దోర్నాల నుంచి శ్రీశైలం వరకు, యర్రగొండపాలెం నుంచి మాచర్ల వరకు, దోర్నాల నుంచి ఆత్మకూరు వరకు తమకు కేటాయించిన ప్రాంతాల్లో నిరంతరం తిరుగుతూ ప్రయాణికులను అప్రమత్తం చేస్తూ అగ్నిప్రమాదాలు జరగకుండా చూస్తున్నారు. దీంతో పాటు శ్రీశైలం వెళ్లే ప్రయాణికుల వాహనాలను గణపతి చెక్‌పోస్టు వద్ద ఆపి బీడీ, సిగరెట్లు తీసివేస్తూ, అగ్నిని మండించే పదార్థాలను సైతం స్వాధీనం చేసుకుంటున్నారు. కఠిన నిబంధనలు అమలు చేస్తూనే ఉన్నారు.

**శాటిలైట్ ద్వారా అప్రమత్తత**

అడవుల్లో జరిగే అగ్నిప్రమాదాలను శాటిలైట్ ద్వారా ఎప్పటికప్పుడు క్షణాల వ్యవధిలో తెలుసుకుంటూ సిబ్బందిని అక్కడికి పంపుతున్నారు. ప్రతి డీఎఫ్‌ఓ పరిధిలో 24/7 విధుల్లో ఉండేలా సిబ్బందిని నియమించారు. ఇందుకోసం వ్యాన్ అగ్నియో జియో పోర్టల్‌ను ఉపయోగిస్తున్నారు. శాటిలైట్ లింక్ ద్వారా ఇది పనిచేస్తోంది. అలాగే వాచ్ టవర్స్ ఉన్న సిబ్బంది కూడా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి అప్రమత్తం చేస్తున్నారు.

**గడిచిన ఐదేళ్లలో ప్రమాదాలు ఇలా..**

| రేంజ్ | 2018 | 2019 | 2020 | 2021 | 2022 | 2023 (మార్చి 23) |
|---|---|---|---|---|---|---|
| మార్కాపురం | 60 | 191 | 182 | 300 | 265 | 305 |
| దోర్నాల | 158 | 388 | 307 | 332 | 326 | 69 |
| వైపాలెం | 54 | 67 | 122 | 195 | 370 | 79 |
| జీవీపల్లి | 225 | 331 | 341 | 550 | 102 | 76 |
| వీపీసౌత్ | 12 | 7 | 27 | 99 | 52 | 47 |
| కొర్రపోలు | 0 | 0 | 0 | 0 | 0 | 180 |
| నెక్కంటి | 0 | 0 | 0 | 0 | 0 | 181 |

**ప్రత్యేక శిక్షణ ఇచ్చాం**



అడవిలో అగ్నిప్రమాదాలు జరగకుండా సిబ్బందిని నియమించి ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. వారికి ఫైర్ బ్లోయర్స్ అందించాం. ఎక్కడైనా ప్రమాదం జరిగితే మా సిబ్బంది వెంటనే స్పందించి మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకున్నారు. అటవీ ప్రాంతంలో ఉండే చెంచులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. ప్రమాదం జరిగిన వెంటనే తమకు సమాచారం అందిస్తారు. దీని ద్వారా మేము సిబ్బందిని అప్రమత్తం చేసి సంఘటన స్థలానికి పంపి మంటలను ఆర్పి వేస్తాం. ప్రయాణికులు కూడా అటవీ ప్రాంతంలో ప్రయాణించేటప్పుడు బీడీలు, సిగరెట్లు తాగవద్దని మా విజ్ఞప్తి. చిన్న ప్రమాదం జరిగినా ఆ నష్టాన్ని పూడ్చటం సాధ్యం కాదు.

– అప్పావు విఘ్నేష్, డీడీ, మార్కాపురం

## న్యూస్‌రీల్

**పుంజు అందం అదరహో**

- జాతీయ స్థాయి అందాల పోటీల్లో 3వ స్థానం కైవసం చేసుకున్న రాజుపాలెం కోడిపుంజు



జాతీయ స్థాయిలో 3వ స్థానంలో నిలిచిన చిలక ముక్కు కోడిపుంజు

కొమరోలు: మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందిన సయ్యద్ బాషాకు చెందిన కోడిపుంజు అందాల పోటీల్లో జాతీయ స్థాయిలో 3వ స్థానం దక్కించుకుంది. ఇటీవల తమిళనాడు రాష్ట్రంలోని కొయంబత్తూరులో జరిగిన జాతీయస్థాయి చిలకముక్కు కోళ్ల అందాల పోటీల్లో ఈ పుంజు 3వ స్థానం దక్కించుకోగా పుంజు యజమాని సయ్యద్ బాషాను బహుమతులు వరించాయి. నిర్వాహకులు ప్రశంస పత్రం, షీల్డ్‌ను అందజేశారు. సుమారు 5 రాష్ట్రాలకు చెందిన కోళ్ల యజమానులు కోడిపుంజులతో పోటీల్లో పాల్గొన్నారు.

## ఇళ్ల నిర్మాణాలు లక్ష్యం మేరకు పూర్తి చేయాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు లక్ష్యం మేరకు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ప్రకాశం భవనం నుంచి మండల స్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి స్వయం సహాయక సంఘాల్లో లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించాలన్నారు. రుణాలు పొందిన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేసేలా చూడాలన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ప్రతి రోజు ఇంటింటి నుంచి చెత్తను తడి పొడి చెత్తగా వేరు చేసి సేకరించాలన్నారు. చూడచక్కని గ్రామాలుగా ఎంపికైన ప్రాంతాల్లో అపరిశుభ్రతను గుర్తిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవన్నారు. స్పందన అర్జీలను క్షేత్రస్థాయి సిబ్బంది పరిష్కరిస్తున్న తీరును మండల స్థాయి అధికారులు రోజూ సమీక్షిస్తుండాలన్నారు. సచివాలయాల ద్వారా సకాలంలో సేవలు ప్రజలకు అందేలా చూడాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా మహిళా పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. జలజీవన్ మిషన్ పథకం, నాడు–నేడు పనులు మరింత వేగంగా చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు మెనూ ప్రకారం పోషకాహారం అందించాలన్నారు. దీనిలో హౌసింగ్ పీడీ పేరయ్య, ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి, సచివాలయాల జిల్లా కో ఆర్డినేటర్ ఉషారాణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గ్లోరియా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మహిళలే మహారాణులు

- మహిళలకు ఇచ్చిన మాటకు కట్టుబడిన జగన్
- వారు అన్ని రంగాల్లో ఆర్థికంగా ఎదగాలన్నదే జగనన్న ధ్యేయం
- ఆసరా 3వ విడత సభలో మంత్రి ఆదిమూలపు సురేష్



మహిళలకు చెక్కు అందచేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

పెద్దదోర్నాల: రాష్ట్రంలోని మహిళలందరూ ఆర్థికాభివృద్ధి సాధించి పురుషులతో సమానంగా ఎదగాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశమని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ ఆసరా 3వ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ బాబూరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్దారవీడు, పెద్దదోర్నాల మండలాలకు చెందిన డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన మహిళలను ఉద్దేశించి మంత్రి సురేష్ మాట్లాడుతూ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మహిళల పక్షపాతి కావడంతో ప్రభుత్వం ఏర్పడిన మూడున్నరేళ్లలోనే అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశారని అన్నారు. 2019 నాటికి డ్వాక్రా మహిళలకు ఉన్న అప్పులు పూర్తిగా విడతల వారీగా రద్దు చేస్తానని పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారమే నవరత్నాల్లో చేర్చి మూడు విడతలుగా నేరుగా మహిళల ఖాతాల్లోకి నగదు జమ చేశారని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు కోసం ప్రాణాలర్పిస్తామని చెప్పిన టీడీపీ నాయకులు వారు అధికారంలో ఉన్న సమయంలో ఆ ప్రాజెక్టు ఊసే ఎత్తకుండా ఇప్పుడు రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే వెలిగొండ పనులను వేగవంతం చేసి మొదటి టన్నెల్ పూర్తి చేసిందని, మరి కొద్ది రోజుల్లో రెండోసొరంగం పనులు పూర్తి చేసి ఈ ప్రాంత భూముల్లో కృష్ణా జలాలను పారిస్తామని ప్రకటించారు. మండలంలోని అయినముక్కల వద్ద రూ.50 కోట్లతో గిరిజన సూపర్ స్పెషాలిటీ వైద్యశాల, మండల పరిషత్ అభివృద్ధి భవన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. అనంతరం పెద్దదోర్నాల, పెద్దారవీడు మండలాలకు చెందిన 1124 డ్వాక్రా గ్రూపు సంఘాలకు రూ.6.28 కోట్ల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో బి.వి.ఎస్.సాయికుమార్, ఎంపీడీఓ నాసర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి, ఎంపీపీలు గుమ్మా పద్మజ, బెజవాడ పెద్ద గురవయ్య, జెడ్పీటీసీ సభ్యులు దుమావత్ లతాబాయి, యేరువ చలమారెడ్డి, సర్పంచ్‌లు చిత్తూరి హారిక, దుగ్గెం చెన్నమ్మ, కాణిపాకం వరసిద్ధి వినాయక ట్రస్టు బోర్డు సభ్యురాలు జోగి రామసుబ్బమ్మ, రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ డి.ఖాసింవలి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దర్శనం నాగయ్య, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు పఠాన్ వహాబ్‌ఖాన్, మండల నాయకులు యక్కంటి మల్లారెడ్డి, చిట్యాల యోగిరెడ్డితో పాటు పలు పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# కలెక్టర్ దినేష్‌కుమార్‌కు అభినందనల వెల్లువ

ఒంగోలు అర్బన్: కలెక్టర్‌గా బాధ్యత చేపట్టి ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా అధికారులు, ఉద్యోగ సంఘాలు, పలు సంస్థల ప్రతినిధులు ప్రకాశం భవనంలో కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలిసి అభినందించారు. జిల్లా యంత్రాంగాన్ని నడిపిస్తున్న తీరును యంత్రాంగం కొనియాడింది. అందరి సహకారంతోనే ఏడాది పాలన ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తి చేశామని కలెక్టర్ అన్నారు. కలెక్టర్‌కు అభినందన తెలిపిన వారిలో జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, డీఆర్‌ఓ శ్రీలత, సీపీఓ వెంకటేశ్వరరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్, ఇతర జిల్లా యంత్రాంగం, రెవెన్యూ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు. క్యాంపు కార్యాలయంలో సిబ్బంది ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ తల్లిదండ్రులు కలెక్టర్‌ను ఆశీర్వదించి అభినందించారు.



కుటుంబ సభ్యులతో కలసి కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

# రాజకీయ లబ్ధి కోసం ఆరోపణలు తగదు

- 2004లో కొన్న భూములకు బాలినేనికి ఏంటి సంబంధం
- మా వ్యాపారాలకు బాలినేనికి ఎటువంటి సంబంధం లేదు
- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వియ్యంకుడు కుండా భాస్కరరెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కుండా భాస్కరరెడ్డి

ఒంగోలు: రాజకీయం చేయాలంటే రాజకీయంగా ఎదుర్కోవాలి. అంతే కానీ ప్రత్యర్థిని ఎదుర్కోవడానికి వారి బంధువుల వ్యాపారాలపై తప్పుడు ఆరోపణలు చేస్తూ వ్యాపార సంస్థల ఇమేజ్‌ను దెబ్బతీయాలనుకోవడం సరికాదని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వియ్యంకుడు కుండా భాస్కరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక హోటల్ సరోవర్ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖలో తమ భూములకు సంబంధించి జనసేన కార్పొరేటర్ ఏదో ఆరోపిస్తే దానిపై కనీసం తమ వివరణ కూడా తీసుకోకుండా తమ సంస్థపై నిందలు వేయడం ఏపాటి నైతికత అన్నారు. దానికితోడు బాలినేని అండతో అక్రమాలకు పాల్పడ్డారనడం దారుణం అన్నారు. 1955 నుంచి తమ సంస్థ దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో వ్యాపారం నిర్వహిస్తోందని, ఎప్పుడూ లేనిది గత కొద్దినెలలుగా తమను టార్గెట్ చేస్తూ వార్తాకథనాలు వండి వార్చడం సరికాదన్నారు.

**బాలినేనికి సంబంధం ఎలా**

విశాఖ జిల్లా అచ్యుతాపురం మండలం చౌడపల్లి భూములను తాను, మరికొంతమంది కలిసి 2004లో కొన్నామని, దానికి 2009లో డీటీసీపీ నుంచి అప్రూవల్ లభించిందన్నారు. బాలినేనితో తమకు బంధుత్వం ఏర్పడింది 2011లో అన్నారు. మరి అలాంటప్పుడు బాలినేనికి, తాము కొన్న భూములకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. పొలిటికల్ సఫరర్స్ భూమిని నిబంధనలకు విరుద్ధంగా బాలినేని ఒత్తిడితో తాము తీసుకున్నట్లు పేర్కొనడం హాస్యాస్పదం అన్నారు. ఈ భూములకు సంబంధించి 22ఏ నిషేధం నుంచి 2016 జనవరి 19వ తేదీన గజిట్ నోటిఫికేషన్ ద్వారా తొలగించారన్నారు. 2016లో బాలినేని కనీసం ఎమ్మెల్యే కూడా కాదని, మరి అలాంటప్పుడు ఆయన అధికారులపై ఎలా ఒత్తిడి తెస్తారని ప్రశ్నించారు. కేవలం రాజకీయ లబ్ధి పొందేందుకు మా సంస్థలపై ఆరోపణలు చేయడం సమంజసం కాదని హితవు పలికారు.

**అక్రమాలు జరిగాయనడం పూర్తిగా అవాస్తవం**

రాజకీయ నాయకులతో బంధుత్వం ఉన్నవారు ఎవరూ వ్యాపారాలు చేయకూడదా అంటూ భాస్కరరెడ్డి ప్రశ్నించారు. తాము ప్రభుత్వ పోరంబోకు, చెరువులను ఆక్రమించి నిబంధనలకు విరుద్ధంగా కాంపౌండ్ వాల్ నిర్మించినట్లు ఆరోపించడం సరికాదని, పూర్తిగా ప్రైవేటు వ్యక్తుల భూములను మాత్రమే కొనుగోలు చేశాము తప్ప అక్రమ పద్ధతిలో భూములు కొనుగోలు చేయాల్సిన అవసరం తమకు లేదన్నారు. తాము లే అవుట్‌కు 105.31 ఎకరాలకు అనుమతి తీసుకున్నామని, ఆ తరువాత మరో 20 ఎకరాలను కొనుగోలు చేసినట్లు చెప్పారు. అందువల్ల 125 ఎకరాలకు కాంపౌండ్ వాల్ నిర్మించామని, ఆ భూములకు కూడా అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నామని తెలిపారు. తాము అటవీశాఖ భూములను ఆక్రమించినట్లు ఆరోపించారని, తమకు లే అవుట్ అప్రూవల్ చేసిందే రెవెన్యూ, అటవీశాఖ అధికారుల సంయుక్త పరిశీలనతోనే అన్నారు. గజం భూమి కూడా ఆక్రమించుకోలేదని, సమీపంలో ఉన్న అటవీ ప్రాంతం నుంచి జంతువులు తమ లేఅవుట్‌లోకి చొరబడకుండా భద్రత కోసం మాత్రమే కాంపౌండ్ వాల్ నిర్మించామన్నారు. అదే విధంగా ఒంగోలులో నిర్మిస్తున్న తమ లేఅవుట్‌పైన ఆరోపణలు చేయడం సరికాదని, వాస్తవాలు పూర్తిగా తెలుసుకుని రాయాలన్నారు. లేని పక్షంలో తాము చట్టపరంగా చర్యలు తీసుకుంటామని భాస్కరరెడ్డి స్పష్టం చేశారు.

## క్లుప్తంగా

### ప్రత్యామ్నాయ రోజుల్లో తరగతులు

ఒంగోలు: జిల్లాలో పదో తరగతి పరీక్ష కేంద్రాలు నిర్వహిస్తున్న పాఠశాలలను ప్రత్యామ్నాయ రోజుల్లో నిర్వహించాలని డీఈవో పి.రమేష్ ఆదేశించారు. ఒంటిపూట బడుల దృష్ట్యా పరీక్షలు ముగిసిన తరువాత విద్యార్థులకు బడులు నిర్వహించడం వల్ల విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. దానికి బదులుగా పదో తరగతి పరీక్ష రోజు పరీక్ష మాత్రమే నిర్వహించాలన్నారు. ఈనెల 5, 7,9,14,16,23,30 తేదీల్లో పాఠశాలలు నిర్వహించాలని ఆదేశించారు.

### బాధ్యతలు చేపట్టిన సీఐలు



ఎస్పీకి పూల మొక్క అందిస్తున్న తాలుకా సీఐ రాంబాబు


బాధ్యతలు చేపట్టిన టూటౌన్ సీఐ జగదీష్

ఒంగోలు టౌన్: ఒంగోలు టూటౌన్ సీఐగా ఎస్.జగదీష్ మంగళవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. సీఐడీలో పనిచేస్తున్న ఆయన రేంజి వీఆర్‌లో ఉన్నారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఆయనను ఒంగోలు టూ టౌన్ పోలీసు స్టేషన్ బదిలీ చేశారు. శాంతి భద్రతల, నేర నియంత్రణపై ప్రధానంగా దృష్టి సారిస్తానని చెప్పారు. అలాగే సాధారణ బదిలీల్లో భాగంగా తాలుకా సీఐగా బాధ్యతలు చేపట్టిన ఆర్.రాంబాబు మంగళవారం ఎస్పీ పోలీసు కార్యాలయంలో ఎస్పీ మలికా గర్గ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఎస్పీకి పూలమొక్కను అందజేశారు.

### రేషన్ బియ్యం స్వాధీనం


పొదిలి: స్థానిక ధనలక్ష్మీ రైస్‌మిల్ రేకుల షెడ్ గోడౌన్‌లో 600 బస్తాల రేషన్ బియ్యాన్ని మంగళవారం సాయంత్రం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మిల్లులో అక్రమంగా అమ్ముకునేందుకు బియ్యం నిల్వ ఉంచినట్లు సమాచారం రావటంతో దాడులు చేసినట్లు అధికారులు తెలిపారు. బియ్యం సీజ్ చేసి, సంబంధిత వ్యక్తులపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయించినట్లు తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ తహసీల్దార్ ఎస్‌కే.షాజిదా, అగ్రికల్చర్ ఆఫీసర్ సంగమేశ్వరరెడ్డి, ఎస్సై వెంగళరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

### బాలుడి కిడ్నీలో ఇన్‌ఫెక్షన్

- ఆర్థిక సహాయం కోసం ఎదురు చూపులు


నగదును అందజేస్తున్న సభ్యులు

అల్లూరు (కొత్తపట్నం): నిరుపేద కుటుంబంలో జన్మించిన బాలుడుకు కిడ్నీలో ఇన్‌ఫెక్షన్ చేరి అనారోగ్యంతో గుంటూరు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. మండలంలో అల్లూరు గ్రామానికి చెందిన అంచుపోగు రాజారావు కుమారుడు సుశాంత్ ముందు చికెన్‌పాక్స్ వ్యాధి వచ్చింది. అనంతరం కామెర్లు వచ్చాయి. దీనివల్ల కిడ్నీలు ఇన్‌ఫెక్షన్‌కు గురి కావడంతో గుంటూరు తరలించగా.. మదర్ థెరీసా హెల్పింగ్ ఆర్గనైజేషన్ టీం సభ్యులు స్పందించి కొంత మందికి సమాచారం అందించారు. టంగుటూరుకు చెందిన మూత్ హెల్పింగ్ ఆర్గనైజేషన్ టీం సభ్యులు సుశాంత్ అమ్మమ్మకు రూ.5 వేలు ఆర్థిక సహాయం చేశారు. సహాయం చేయదలిచిన వారు 7013226858 ఫోన్ చేయాల్సిందిగా కోరారు. డి.కేశవ, ఎం.సునీల్, డి.సుజిత్ పాల్గొన్నారు.


వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభ

భక్తుల ఇలవేల్పు.. కొంగు బంగారమైన శ్రీ నెమిలిగుండ్ల రంగనాయక స్వామిని దర్శించుకుంటే సకల పాపాలు దూరమవుతాయి. ఆయన చూపు పడిన భక్తులకు సకల శుభాలు కలుగుతాయి. అందుకే ఎంత శ్రమ అయినా సరే నల్లమల అడవుల్లో కొండపై వెలసిన ఆ పరమాత్ముడి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు వేలాది మంది నల్లమల వైపు అడుగులు వేస్తుంటారు.

# రంగనాయకా.. పాహిమాం!


నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానం


నెమలిగుండ్ల రంగనాయకస్వామి


ఆదిలక్ష్మి అమ్మవారు


దేవస్థానం వద్ద అందాల గుండ్లకమ్మ జలపాతం

- రేపటి నుంచి నెమలిగుండ్ల రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు
- నల్లమల అందాల నడుమ వెలసిన కోవెల
- పర్యాటక కేంద్రంగా విలసిల్లుతున్న క్షేత్రం
- మనసుకు హాయినిచ్చే జలపాతం

రాచర్ల: మండలంలోని జేపీ చెరువు గ్రామానికి 5 కిలో మీటర్ల దూరంలో గల దట్టమైన నల్లమల అడవుల్లో వెలసిన శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థానం భక్తుల పాలిట కొంగు బంగారమయింది. ప్రతి ఏడాది జరిగే బ్రహ్మోత్సవాలు భక్తిభావాన్ని రెట్టింపు చేస్తూ కోవెల ప్రాశస్త్యాన్ని మరింత ఉన్నత స్థితికి చేర్చుతాయి. ఈ వేడుకలకు రాష్ట్రంతో పాటు తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల నుంచి వేలాది భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకుని పునీతులవుతుంటారు. ఇందులో భాగంగా నిర్వహించే నెమలిగుండ్ల రంగనాయక స్వామి, అమ్మవారి కల్యాణం బ్రహ్మోత్సవాల మొత్తానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఈవేడుక తిలకించేందుకు వచ్చిన భక్తజనంతో నల్లమల అటవీ ప్రాంతమంతా జనసంద్రంగా మారుతుంది. 1994 నుంచి ప్రతి ఏటా చైత్ర బహుళ పౌర్ణమితో పాటు పాడ్యమి, విదియల్లో బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా జరుగుతాయి. ఈ ఏడాది 6, 7, 8 తేదీల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

**ఎప్పటికీ ఎండిపోని గుండం**

రంగనాయకస్వామి కొండపై ఉండే గుండ్ల బ్రహ్మేశ్వరం వద్ద పుట్టిన గుండ్లకమ్మ నది జలపాతంగా రూపాంతరం చెంది శ్రీరంగానాయకుని దేవస్థానం వద్ద కొండపై నుంచి గుండంలో పడుతుంది. ఇది ఎంతో ఆకర్షణీయంగా ఉండటంతో ఆలయానికి వచ్చిన వారంతా ఆసక్తిగా గమనిస్తుంటారు. ఈ నదీ జలాలు నల్లమల అడవుల ద్వారా తురిమెళ్ళ మీదుగా కంభం చెరువుకు చేరతాయి. అలాగే మార్కాపురం నుంచి తూర్పు దిశగా పయనించి సముద్రంలో కలిసిపోతాయి. వర్షాలు ఉన్నా లేకపోయినా రంగస్వామి గుండం ఎప్పటికీ ఎండిపోకుండా ఉండటం విశేషం.

**మూడు రోజుల పాటు**

6వ తేదీ గురువారం అంకురార్పణ, 7వ తేదీ శుక్రవారం నెమలి గుండ్లరంగనాయకస్వామి కల్యాణం, 8వ తేదీ శనివారం స్వామి వారి తెప్పోత్సవం, దివ్య రథోత్సవ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

**ఎలా వెళ్లాలి?**

నెమలిగుండ్లరంగనాయకస్వామి దేవస్థానం చేరుకోవాటానికి గిద్దలూరు నుంచి వయా కొండపేట, అంబవరం, వెల్లుపల్లి మీదుగా దేవస్థానం చేరుకోవచ్చు. అదేవిధంగా గిద్దలూరు నుంచి వయా రాచర్ల, అనుములపల్లె, జేపీ చెరువు మీదుగా వెళ్లే అవకాశం ఉంది. అంతేకాక కంభం నుంచి తుడిమెళ్ల, అక్కపల్లె, చోళ్లవీడు, చినగానిపల్లె, జె.పి చెరువు గ్రామాల మీదుగా రంగస్వామి ఆలయానికి చేరుకోవచ్చు.

**ఏర్పాట్లు పూర్తి**



నెమలిగుండ్ల రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాల కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా త్వరగా స్వామి వారి దివ్యదర్శనం జరిగేలా అన్ని ఏర్పాట్లు చేశాం. దేవస్థానం ప్రాంగణంలో భక్తులకు ప్రత్యేక క్యూలైన్‌లను కూడా అదనంగా ఉంచాం. దేవస్థానానికి వెళ్లే మార్గంలో దాతల సహకారంతో మజ్జిగ, మంచినీటి సరఫరా ఉంటుంది.

– ఈదుల చెన్నకేశవరెడ్డి, దేవస్థానం కార్యనిర్వహణాధికారి

# తెలంగాణ గంజాయి ముఠా అరెస్టు

- నిందితుల నుంచి 7.5 కిలోలు స్వాధీనం

ఒంగోలు టౌన్: కొద్ది రోజులుగా ఒంగోలు నగరంలో గంజాయి విక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయన్న సమాచారం మేరకు పోలీసులు అప్రమత్తం అయ్యారు. ఎస్పీ మలికా గర్గ్ ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు నగరంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో తెలంగాణకు చెందిన ఓ ముఠా కొత్త కూరగాయల మార్కెట్ వద్ద అనుమానంగా సంచరిస్తున్నట్లు సమాచారం వచ్చింది. దీంతో వెంటనే రంగంలోకి దిగిన వన్‌టౌన్ ఎస్ఐ యువీ కృష్ణయ్య సిబ్బందితో కలిసి పాత చేపల షెడ్డు వద్దకు చేరుకోగానే పోలీసులను చూసి కొందరు యువకులు పారిపోయేందుకు యత్నించారు. వారిని వెంబడించి పట్టుకొని ప్రశ్నించగా అసలు విషయం బయటపడింది. తెలంగాణకు రాష్ట్రంలోని రాక్‌హిల్స్ కాలనీకి చెందిన బాణవత్ ఆంజనేయులు తల్లిదండ్రులు ఒంగోలులోని చంద్రయ్య నగర్‌లో నివాసం ఉంటారు. డిగ్రీ వరకు చదివి ఫెయిలైన అతడు మిర్యాలగూడలోని మేనమామ వద్ద ఉంటున్నాడు. చదువుకునే సమయంలో హాస్టల్ వద్ద తిరుమలగిరికి చెందిన కాటి మహేష్ పరిచయమయ్యాడు. అతడి ద్వారా శీలం అరుణ్ కుమార్, కేతమాల కిరణ్, షేక్ నాగుర్ మీరా స్నేహితులయ్యారు. వీరంతా తరచుగా గంజాయి సేవించే వారు. ఈ క్రమంలో కొత్తగూడెంకు చెందిన శీలం అరుణ కుమార్ వద్ద నుంచి గంజాయి పొకెట్లు తీసుకొచ్చి డబ్బు సంపాదించి జల్సా చేయాలనుకున్నారు.

వీరంతా కలిసి ఒంగోలు, చీమకుర్తిలో గంజాయి విక్రయించి అటునుంచి కొత్తపట్నం బీచ్‌కు వెళ్లి ఎంజాయ్ చేయాలని ప్లాన్ చేసుకున్నారు. ఈ క్రమంలో కిలో 6వేల రుపాయల ప్రకారం ఒక్కొక్కరు ఒక కిలో చొప్పున కొనుగోలు చేశారు. ఆర్టీసీ బస్సులో ఒంగోలుకు చేరుకున్నారు. సమీపంలోని డార్మెటరీలో విశ్రాంతి తీసుకొని మధ్యాహ్నం కొత్త కూరగాయల మార్కెట్ పక్కనే ఉన్న చేపల మార్కెట్ వద్దకు చేరుకున్నారు. అక్కడ గంజాయిని పాకెట్లుగా చేసి విక్రయించాలనుకున్నారు. అయితే సమాచారం అందుకున్న పోలీసులు ఐదుగురు నిందితులను అదుపులోకి 7.500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ సీఐ టి.వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

**ఎస్పీ అభినందనలు**

అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న అంతర్రాష్ట్రీయ ముఠాను అరెస్టు చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన వన్‌టౌన్ సీఐ టి.వెంకటేశ్వర్లు, ఎస్ఐ యువీ కృష్ణయ్య, హెడ్ కానిస్టేబుళ్లు షేక్ ఖాజావలి, చక్రవర్తి బాబు, ఎం.సాయికృష్ణ, కానిస్టేబుళ్లు ఎం.తిరుపతయ్య, కె.శ్రీనివాసరావు, ఎం.అనిల్‌ను, డీఎస్పీ యు.నాగరాజును ఎస్పీ మలికా గర్గ్ అభినందించారు.

# కనిగిరిలో మహిళ హత్య


కె. సుశీల (ఫైల్)


రక్తపు మడుగులో సుశీల మృతదేహం

కనిగిరి రూరల్: పట్టణంలోని కొత్తపేట కాశినాయన గుడి వీధిలో నివాసం ఉండే కె. సుశీల (43) హత్యకు గురైంది. అందిన సమాచారం మేరకు.. సుశీల సుమారు 20 ఏళ్ల నుంచి తన నాలుగు పోర్షన్ల సొంత ఇంటిలో ఒంటరిగా జీవిస్తోంది. పై ఇంటి రెండో పోర్షన్‌లో విద్యార్థులు అద్దెకు ఉంటున్నారు. దాని పక్కన పోర్షన్ ఇటీవలే ఖాళీ అయింది. మంగళవారం రాత్రి సినిమాకు వెళ్లి వచ్చిన విద్యార్థులు ఖాళీగా ఉన్న పోర్షన్ ఇంటి తలుపు తెరిచి ఉండటాన్ని గమనించారు. లోపల చూడగా సుశీల రక్తపు మడుగులో విగత జీవిగా పడిఉండటాన్ని గమనించారు. పక్కన కత్తి కూడా ఉంది. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్సై దాసరి ప్రసాద్‌లు ఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు జరుపుతున్నారు. కాగా సుశీల మృతికి ఆస్తి గొడవలా..లేకా ఇంకేమైన కారణాలున్నాయా అనేకోణంలో దర్యాప్తు జరుగుతోంది.

# అంబరాన్నంటిన ఆసరా సంబరాలు


మెప్మా మహిళా సంఘాల సభ్యులతో కలిసి కోలాటం వేస్తున్న మేయర్ గంగాడ సుజాత


క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

- నగర పరిధిలో స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ. 98 కోట్ల లబ్ధి
- చర్చిసెంటర్‌లో కోలాటం

ఒంగోలు: స్వయం సహాయక సంఘాల మహిళల్లో ఆనందం తొణికిసలాడింది. నగర పరిధిలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున స్థానిక చర్చిసెంటర్‌కు చేరుకున్నారు. మహిళా పక్షపాతిగా జగనన్న పాలన సాగుతుందంటూ కోలాట ప్రదర్శన నిర్వహించి సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. మహిళలంతా ఒకే రకమైన వస్త్రాలు ధరించి చేసిన కోలాట ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. మిట్టమధ్యాహ్నం ఎండను కూడా లెక్క చేయకుండా వారు ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ విగ్రహానికి, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు ప్రకటించారు. నగర మేయర్ గంగాడ సుజాత మీడియాతో మాట్లాడుతూ విశ్వాసానికి మారుపేరు మహిళలన్నారు. అందుకే మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా , సామాజికంగా ఎదగాలనే ఆకాంక్షతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. ఈ క్రమంలో పాదయాత్రలో మహిళలకు దశల వారీగా స్వయం సహాయక సంఘాల రుణ భారాన్ని ప్రభుత్వం చెల్లిస్తుందని హామీ ఇచ్చారని, అందులో భాగంగా మూడో విడత నిధులు విడుదల కావడం పట్ల మహిళా సభ్యుల్లో ఎనలేని ఆనందం కనిపిస్తోందన్నారు. ఒక్క నగర పరిధిలోని మహిళా సభ్యులకు రూ. 98 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల మంది మహిళల పేరుమీద పట్టాలిచ్చి వారందరినీ ఆర్థికంగా బలోపేతం చేశారన్నారు. జీవితంలో సొంత గూడు కట్టుకోగలమా అన్న మీమాంసలో ఉన్నవారికి తమ సొంత ఇంటి కల నెరవేరుతుందన్న భరోసా కనిపిస్తోందన్నారు. జీవితకాలం సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డే ఉండాలంటూ రాబోయే ఎన్నికల్లో మరోమారు పట్టం కట్టేందుకు 80 లక్షల మంది మహిళా సంఘాల సభ్యులు సిద్ధంగా ఉన్నారన్నారు. సంక్షేమ క్యాలెండర్ ప్రకటించి మరీ ఆదుకుంటున్న సీఎం వైఎస్ జగన్ హయాంలోనే తమ జీవితాల్లో ఆనందం నెలకొంద పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పురిణి ప్రభావతి, మెప్మా పరిధిలోని రీసోర్స్ పర్సన్‌లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# సందడే..సందడి

- ఘనంగా మందిరాల సంబరాలు
- వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో 3 మందిరాల ఏర్పాటు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- వేలాదిగా తరలి వచ్చిన అభిమానులు, ప్రేక్షకులు
- నేడు రామతీర్థంలో ప్రసిద్ధి చెందిన రామతీర్థం గంగమ్మ తిరునాళ్ల

చీమకుర్తి: మందిరాల సంబరాలు అంబరాన్నంటాయి. బుధవారం రామతీర్థం గంగమ్మ తిరునాళ్ల సందర్భంగా ముందు రోజు మంగళవారం రాత్రి చీమకుర్తి పట్టణంలో ప్రభ మందిరాలతో ఏటా మందిరాల సంబరాలు నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. దానిలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మూడు మందిరాలు, టీడీపీ ఆధ్వర్యంలో ఒకటి, పద్మశాలీయులు, ఆర్యవైశ్య సంఘం తరఫున ఒక్కొక్కటి చొప్పున మొత్తం 6 ప్రభ మందిరాలను చీమకుర్తి పట్టణంలో ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ మందిరంపై స్థానిక ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బూచేపల్లి శివసేన ఆధ్వర్యంలో ఒకటి, మాజీ ఏఎంసీ చైర్మన్ మారం వెంకారెడ్డి ఆధ్వర్యంలో మరొక మందిరాలను ఏర్పాటు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభపై జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ప్రేక్షకులనుద్దేశించి ఉత్తేజపూరితంగా ప్రసంగించి ఆకట్టుకున్నారు. అభిమానుల సందడి మధ్య సాంస్కృతిక కార్యక్రమాలను వారు ప్రారంభించారు. విద్యుత్ దీపాలతో ప్రభ మందిరాలను సుందరంగా నిర్మించారు. ప్రభలపై పలు ప్రాంతాల నుంచి పిలిపించిన ప్రత్యేక కళాకారులు ప్రేక్షకులను సినీగీతాలతో, వైఎస్సార్‌సీపీ పాటలతో నృత్యాలు ప్రేక్షకులను అలరించారు. చీమకుర్తి పట్టణంతో పాటు చుట్టు పక్కల మండలాల నుంచి వేలాది మంది ప్రేక్షకులు మందిరాల సంబరాలకు తరలివచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభలపై పార్టీకి చెందిన ప్రధాన నాయకులు, కార్యకర్తలు సందడి చేశారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి


వైఎస్సార్ సీపీ ప్రభపై ప్రదర్శించిన నృత్యాలు


సాంస్కృతిక కార్యక్రమాలను ఆసక్తిగా తిలకిస్తున్న ప్రేక్షకులు